క్లుప్తంగా

భీమేశ్వరాలయ అన్నదాన ట్రస్ట్‌కు విరాళం



అన్నదాన ట్రస్ట్‌కు విరాళం అందజేస్తున్న లక్ష్మీనరసింహమూర్తి కుటుంబం

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయ అన్నదాన ట్రస్ట్‌కు రాజమహేంద్రవరానికి చెందిన శ్రీపాద లక్ష్మీ నరసింహమూర్తి తమ పెద్దలు శ్రీపాద కామశాస్త్రి, సూర్యకాంతం పేరిట రూ.51,116 విరాళంగా అందజేశారు. అనంతరం కుటుంబ సమేతంగా స్వామి, అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ చండీ హోమందారు జుత్తుక చిన్నా, పారాయణదారు మేడవరపు శ్రీరామ్ శర్మలు పాల్గొన్నారు.

నేడు వేంకటేశ్వరస్వామి జన్మనక్షత్ర పూజలు

కపిలేశ్వరపురం: అంగరలోని అలివేలు మంగ, గోదాదేవి సమేత వైభవ వేంకటేశ్వర స్వామికి శ్రవణా నక్షత్ర పూజలను ఆదివారం చేయనున్నారు. ఆ మేరకు ఆలయ అర్చక బృందం ఏర్పాట్లు చేసినట్టు ఆలయ నిర్వాహకులు తెలిపారు. తెల్లవారుజామున స్వామికి పంచామృతాభిషేకం చేసిన అనంతరం భక్తుల దర్శనార్థం అనుమతిస్తారన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

కపిలేశ్వరపురం: అంగర విద్యుత్ సబ్‌స్టేషన్‌లోని వల్లూరు ఫీడర్ పరిధిలోని గ్రామాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని రామచంద్రపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రత్నాలరావు శనివారం తెలిపారు. ఫీడర్ పరిధిలో ఆర్ఎస్ఎస్ పనులు చేపట్టనున్న నేపథ్యంలో వల్లూరులో ఉదయం 10 నుంచి 12 గంటలు వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని వినియోగదారులు సహకరించాలని కోరారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



8వ వార్డులో డ్రెయిన్ నిర్మాణ పనులకు కొబ్బరికాయ కొడుతున్న చైర్‌పర్సన్

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణంలోని 8వ వార్డులో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి శనివారం శంకుస్థాపన చేశారు. రూ.7 లక్షల అంచనాతో మూడు సీసీ డ్రెయిన్లను నిర్మించనున్నారు. ఎమ్మెల్యే, చైర్‌పర్సన్, కౌన్సిలర్‌లు మాట్లాడుతూ ప్రాధాన్యతా క్రమంలో వార్డును అభివృద్ధి చేస్తున్నామన్నారు.

రిటైర్డ్ ఎంప్లాయీస్‌కు ప్రభుత్వం చేయూతనివ్వాలి



మండపేటలో రిటైర్డ్ ఎంప్లాయీస్ సమస్యలపై మాట్లాడుతున్న నాయకులు

కపిలేశ్వరపురం (మండపేట): రిటైర్డ్ ఎంప్లాయీస్‌కు ప్రభుత్వం చేయూతనివ్వాలని రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ మండపేట శాఖ అధ్యక్ష, కార్యదర్శులు దేవళ్ళ సత్యనారాయణ, కార్యదర్శి పెంకే గోవిందరావు అన్నారు. పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం అసోసియేషన్ మండపేట శాఖ సమావేశం నిర్వహించారు. పట్టణం, రూరల్ గ్రామాల్లోని రిటైర్డ్ పెన్షనర్లు హాజరు కాగా కమ్యుటేషన్ తగ్గింపు, ఇన్‌టాక్స్, ఇటీవల రిటైర్ అయిన ఉద్యోగులకు రిటైర్‌మెంట్ బెనెఫిట్స్ పొందే వివరాలపై చర్చించారు.

రోడ్డు ప్రమాదంలో స్కూటరిస్టుకు గాయాలు

కాజులూరు: మండలంలోని గొల్లపాలెం, కుయ్యేరు రహదారిలో బందనపూడి ఊటచెరువు సెంటర్ వద్ద శనివారం ఒక స్కూటరిస్టు అదుపుతప్పి తీవ్ర గాయాల పాలయ్యాడు. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కరప మండలం నడకుదురుకు చెందిన జక్కిన రాజు తన స్కూటర్‌పై కాజులూరు వచ్చి తిరిగి వెళుతున్నాడు. ఊటచెరువు వద్ద మలుపులో రోడ్డు బెర్మ్ దిగి స్కూటరు నడుపుతుండగా ప్రమాదవశాత్తూ అదుపుతప్పి రోడు పక్కన ఉన్న గోతిలో పడ్డాడు. ఈ సంఘటనలో అతను గాయాల పాలవగా స్థానికులు గమనించి కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఆహారం కారాదు హాలాహలం

- వానాకాలంలో మాంసాహారం మానడమే మేలు
- పౌష్టికాహారంపై అవగాహన అవసరం
- కల్తీ పదార్థాల విక్రయాలు ప్రమాదకరం



ఈ ఏడాది మే 26న మండపేటలో తనిఖీ చేస్తున్న జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారులు



పోషక విలువలు కలిగిన కూరగాయలు

కపిలేశ్వరపురం: ఆకలేస్తుందని ఏది పడితే అది నోటిలో వేసేస్తే అనారోగ్యం పాలుకాక తప్పదు. మిగిలిన రోజుల్లో సంగతి ఎలా ఉన్నా వానాకాలం మాత్రం శరీరం అస్సలు సహించదు. పొట్టలోకి వెళ్లే ప్రతి పదార్థం మొత్తం శరీర ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తుంది. తినే పదార్థాన్ని శరీరంలో సత్తువ కోసం తినాలి తప్ప నాలుక రుచి కోసం కాదని అర్థం చేసుకోక తప్పదు. వానాకాలం సూక్ష్మక్రిముల ప్రభావం అధికంగా ఉంటున్న నేపథ్యంలో ఆహార జాగ్రత్తలపై అవగాహన అవసరం.

రెండు నియోజకవర్గాల్లో ఆహార వినియోగమిలా...

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లో విస్తారంగా రెస్టారెంట్లు, హోటళ్లు ఉన్నాయి. పల్లెల్లో సైతం ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు నిర్వహణలో ఉన్నాయి. ఆయా కేంద్రాల ద్వారా వేలాది మంది మాంసాహార, శాకాహార పదార్థాలను కొనుగోలు చేస్తున్నారు. 2023 ఆగస్టు 27న మండపేట పట్టణంలోని ఓ బిర్యానీ పాయింట్‌లో బిర్యానీ కొన్న తాపేశ్వరానికి చెందిన యువకుడుకి ప్యాకెట్‌లో బిర్యానీతో పాటు బొద్దింక దర్శనమిచ్చింది. పట్టణంలోని మరో హోటల్‌లో సాంబార్‌లో బల్లిపడిందంటూ సోషల్‌మీడియాలో హల్‌చల్ చేసింది. 2021 జూలైలో రామచంద్రపురం, మండపేట పట్టణాల్లో ఆహార తయారీ, నిల్వ, రవాణా కేంద్రాలపై జిల్లా ఫుడ్ కంట్రోల్ అధికారులు తనిఖీ చేసి ఆహార పదార్థాలు, నెయ్యి, నూనె తదితర సరకుల నమూనాలను సేకరించి పరీక్షించారు. రుచుల కోసం అశాస్త్రీయమైన పదార్థాలను వినియోగిస్తున్నట్టు గుర్తించారు. ఈఏడాది మే 26న జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారులు మండపేట పట్టణంలోని ఆహార విక్రయ కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించి నిర్వాహకులకు నియమ నిబంధనలు వివరించారు. ఫుడ్ సెంటర్ల నిర్వాహకులు, ఆహార సంబంధిత సరకుల విక్రయ దుకాణదారులు తప్పనిసరిగా ఆహార భద్రతా నియమావళి ప్రకారం ప్రభుత్వం నుంచి లైసెన్సులు తీసుకోవాల్సి ఉంటుంది. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ యాక్ట్ -2006లోని సెక్షన్ 206 ప్రకారం చర్యలు ఉంటాయి. నేరం రుజువైతే 6 నెలల జైలు శిక్ష, రూ.5 లక్షలు వరకూ జరిమానా విధిస్తారన్న హెచ్చరికలున్నాయి.

వానాకాలంలో మాంసాన్ని తింటే వచ్చే ఇబ్బందులివీ...

వర్షాకాలంలో పశువులకు పలు ఆరోగ్య సమస్యలు కలుగుతాయి. వాతావరణ మార్పులు వల్ల మాంసం తిన్న వారిలో బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్స్ కలగడం ద్వారా అజీర్తి, విరేచనాలు, జ్వరం రావడం వంటి సమస్యలు సహజంగా తలెత్తుతాయి. ఇలాంటి పరిస్థితుల్లో వైద్యానికి ఆలస్యమైతే ప్రమాదం పొంచి ఉంది.

ప్రకృతి ఆహారంలో పోషక విలువలిలా...

ప్రకృతి సిద్ధమైన కూరగాయలు, పండ్లు, గింజలను ఆహారంగా తీసుకోవడం బలవర్ధకమే కాకుండా ఆరోగ్యాన్ని ప్రసాదిస్తాయి. 100 గ్రాముల ప్రమాణంలో పోషక విలువలిలా ఉంటాయి. అరటి, చిక్కుళ్లలో సుమారుగా 90 కేలరీల శక్తి ఉంటుంది. క్యారెట్, కాలీఫ్లవర్, మునగ, కాకరకాయ, గుమ్మడి, వంకాయ, టమాటాల్లో 30 కేలరీలు, బీరకాయ, గోరు చిక్కుళ్లలో 20 కేలరీల శక్తి లభిస్తుంది. ఆకు కూరల్లో కరివేపాకు, పొన్నగంటి ఆకుల్లో 100 కేలరీలు, గోంగూర, మెంతి కూర, పుదీనా, తోటకూర, కొత్తిమీర, బచ్చలిలో 50 కేలరీలు, పాలకూర, చుక్కకూరల్లో 15 కేలరీలు ఉంటాయి. గ్రీన్ ద్రాక్ష, రేగుపండు, దానిమ్మ, నేరేడు, ఆపిల్‌లో 70 కేలరీల శక్తి లభిస్తుంది. నల్లద్రాక్ష, జామ, కమల, అనాస, బత్తాయి, బొప్పాయిల్లో 50 కేలరీలు, రాగులు, సజ్జలు, పెసలు, గోధుమల్లో సుమారుగా 350 కేలరీల శక్తి లభిస్తుంది.

పరిస్థితులకు అనుగుణంగా ఆహారం తీసుకోవాలి



వర్షాకాలంలో త్వరగా జీర్ణమయ్యే ఆహార పదార్థాలను తినడం మేలు. క్రిమి కీటకాదుల ప్రభావంతో ఇతర ఆరోగ్య సమస్యలూ తలెత్తే అవకాశాలున్నాయి. సంపూర్ణ ఆరోగ్యంతో ఉండటం ద్వారా ఎలాంటి ప్రతికూల పరిస్థితులనైనా ఎదుర్కోవచ్చు.

– పి.రత్నకుమారి, వైద్యాధికారి, అంగర పీహెచ్‌సీ

చేల గట్ల వెడల్పుతో అదనపు ఆదాయం

అంబాజీపేట: ప్రకృతి వ్యవసాయంలో భాగంగా చేల గట్లను వెడల్పు చేయడమే కాకుండా వాటిపై కూరపాదుల సాగు చేయడం వల్ల రైతులకు అదనపు ఆదాయం వస్తుందని ప్రకృతి వ్యవసాయ జిల్లా అధికారి శ్రీనివాసరావు అన్నారు. వక్కలంకలో నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను శనివారం పరిశీలించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ సాగు చేస్తున్న గుత్తుల ధర్మారావు, పి.గన్నవరం డివిజన్ మాస్టర్ ట్రైనర్ జనుపల్లి నాగమణి వ్యవసాయ క్షేత్రంలో చేల గట్లను వెడల్పు చేశారన్నారు. ఈ గట్లపై వంగ, మిర్చి, టమాట, బెండ, చేమ, పసుపు సాగు చేస్తున్నారన్నారు. చేల గట్లపై సాగు చేయడం వల్ల నాణ్యమైన కూరగాయలతో పాటు రైతులకు అదనపు ఆదాయం వస్తుందని రైతులకు వివరించారు. ప్రకృతి సాగు చేయడం వల్ల అధిక దిగుబడులు సాధించడమే కాకుండా నాణ్యమైన కూరగాయలు పండించవచ్చన్నారు.



చేల గట్లపై నాటిన కూరపాదులను పరిశీలిస్తున్న జిల్లా అధికారి శ్రీనివాసరావు

యోగా ట్రయల్ రన్



మండపేటలో యోగా శిక్షణలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు



హసన్‌బాదలో యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సర్పంచ్ సతీష్‌రావు తదితరులు



గొల్లపాలెంలోని ఒక ప్రైవేటు కళాశాలలో యోగా ఆసనాలు వేస్తున్న విద్యార్థులు

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పురపాలక సంఘం ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు యోగాపై అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని బాబు అండ్ బాబూ కన్వెన్షన్ హాల్‌లో ఈనెల 21న యోగా డే సందర్భంగా యోగా ట్రయల్‌రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి శిక్షణ శిబిరాన్ని సందర్శించారు. ప్రముఖ యోగా గురువు, విజయవాడ సత్యసాయి ధ్యానమండలికి చెందిన రఘు, తిరుపతిరాజులు యోగాపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమాన్ని కమిషనర్ టీవీ రంగారావు పర్యవేక్షించారు.

హసన్‌బాదలో..

రామచంద్రపురం రూరల్: ఈ నెల 21న యోగా దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విశాఖపట్నం వస్తున్న సందర్భంగా జరుగుతున్న యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం హసన్‌బాదలో సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు ఆధ్వర్యంలో 8 చోట్ల యోగాంధ్ర ట్రయల్ రన్ కార్యక్రమాలు నిర్వహించారు. సచివాలయ సిబ్బంది గ్రామస్తులతో యోగా, మెడిటేషన్ టీచర్ యర్రంశెట్టి మంగారత్నం మెడిటేషన్ చేయించారు. అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కాశి రాకేష్‌కుమార్, సచివాలయ, పంచాయతీ, ఆరోగ్య, రెవెన్యూ సిబ్బంది, డ్వాక్రా మహిళలు, హసన్‌బాద జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గొల్లపాలెంలో..

కాజులూరు: యోగాసనాల సాధన ద్వారా మనిషి మెరుగైన ఆరోగ్యాన్ని, మానసిక ప్రశాంతతను పొందగలుగుతాడని బీజేపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ దూడల శంకరనారాయణమూర్తి అన్నారు. ఈ నెల 21 ప్రపంచ యోగాదినోత్సవం సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో అధికారులు, నాయకులు గత కొన్ని రోజులుగా యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా శనివారం పలు గ్రామ సచివాలయాలు, ప్రైవేటు కళాశాలల్లో మాక్ డ్రిల్ నిర్వహించి యోగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. శంకర్ మాట్లాడుతూ ధ్యానం, యోగాసనాల సాధన ద్వారా ఆరోగ్యకరమైన ఆధ్యాత్మిక సమాజం సాధ్యమౌతుందన్నారు. కార్యక్రమాల్లో ఎంపీడీవో జె.రాంబాబు, పలువురు గ్రామ సచివాలయ కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

రవికుమార్ కుటుంబానికి అండగా ఉంటాం



వాకతిప్పలో రవికుమార్ కుటుంబ సభ్యులకు సాయమందిస్తున్న నాయకులు

కపిలేశ్వరపురం: వాకతిప్ప గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ గ్రామ బూత్ కమిటీ సభ్యుడు బొమ్మిడి రవికుమార్ ఇటీవల అకాల మృతి చెందాడు. మృతుని కుటుంబానికి తమ వంతు అండగా నిలుస్తామని వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు తెలిపారు. వాకతిప్పలోని రవికుమార్ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, వైఎస్సార్ సీపీ మండల నాయకులు పుట్టా కృష్ణమూర్తి, మేడిశెట్టి దుర్గారావు, వైస్ ఎంపీపీ గుణ్ణం భానుప్రసాద్, ఎంపీటీసీ పలివెల మధు, యర్రంశెట్టి నాగేశ్వరరావు, నాయకులు గూటం సత్యనారాయణ, పోలిశెట్టి గణేష్, కొప్పిశెట్టి రామ్‌కిశోష్, గెద్దాడ రామకృష్ణ, పాలింగి శ్రీనివాస్ బాధిత కుటుంబానికి ఆర్థికసాయం చేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



వేగాయమ్మపేటలో ఫ్రైడే డ్రైడేలో పాల్గొన్న జిల్లా మలేరియా అధికారి వెంకటేశ్వరరావు

రామచంద్రపురం రూరల్: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి నక్కా వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని వేగాయమ్మపేటలో యాంటీ మలేరియా మంత్ కార్యక్రమంలో భాగంగా శనివారం పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించారు. జూన్ నెలలో దోమ గుడ్లు పెట్టి సంతానం వృద్ధి చేస్తుందని తెలిపారు. దోమ పుట్టకుండా, కుట్టకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు వివరించారు. డెంగీ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా డ్రైనేజీల్లో యాంటీ లార్వా మందులను పిచికారీ చేయించాలని సిబ్బంది ఆదేశించారు. ఫ్రైడే, డ్రై డే యాప్‌ను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి నాగబాబు, ఎంపీహెచ్ఈఓ ఎంతః సుబ్రహ్మణ్యం, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వేంకటేశ్వరుని దర్శనానికి పోటెత్తిన భక్తులు



జొన్నాడలో అలంకార భూషితుడైన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి



నల్లచెరువు వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో వేంచేసిన అలిమేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయం శనివారం భక్తులతో పోటెత్తింది. స్వామివారి దర్శనం కోసం తెల్లవారుజాము నుంచి భక్తులు పెద్ద ఎత్తున బారులు తీరారు. వేంకటేశ్వర స్వామికి ఆలయ వేదపండితుల ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామికి తోమాల సేవ, అర్చన, నైవేద్యం, నక్షత్ర హారతి, కుంభ హారతి వంటి విశేష పూజలు జరిపారు. వేదపండితులు స్వామికి లక్ష తులసి పూజ నిర్వహించారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఆలయం వద్ద భక్తులకు భారీ అన్నదానం చేశారు. స్వామికి భక్తులు పటికబెల్లం తులాభారం నిర్వహించి మొక్కు తీర్చుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. అలాగే అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి వారి ఆలయంలో భక్తులు సందడి చేశారు. స్వామివారికి వివిధ పూజల ద్వారా రూ.4,31,448 ఆదాయం లభించింది. స్వామివారి అన్నదాన ప్రసాదాన్ని 3200 మంది భక్తులు స్వీకరించారు.

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. దీంతో మండలంలోని చింతలూరు, సంధిపూడి, గుమ్మిలేరు, నర్సిపూడి, జొన్నాడ గ్రామాల్లోని ఆలయాల ఆవరణలో భక్తులు గోవింద నామస్మరణతో ప్రదక్షిణలు చేస్తూ భక్తపారవశ్యం చెందారు. ఆయా దేవాలయాల ఆలయ పురోహితులు వేద మంత్రోచ్చారణల మధ్య భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. స్థానిక ఆలయ మండపంలో ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక, భజన కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

మున్సిపల్ కార్మికులకు పీడీఎస్‌యూ మద్దతు



రామచంద్రపురం మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు మద్దతుగా సమ్మెలో పాల్గొని మాట్లాడుతున్న సిద్ధూ

రామచంద్రపురం: రామచంద్రపురం మున్సిపల్ కార్యాలయం వద్ద 27 రోజులుగా తమ న్యాయమైన సమస్యల పరిష్కారానికి సమ్మె చేస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్‌కు పీడీఎస్‌యూ శనివారం మద్దతు ప్రకటించింది. ఈ మేరకు పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధూ ఆధ్వర్యంలో సమ్మెలో పాల్గొన్నారు. న్యాయమైన డిమాండ్ల కోసం సమ్మె చేస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకుడు కె.సురేష్, మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు జీఎస్ శ్రీనివాసరావు, వి.శ్రీనివాస్, జి.ప్రసాద్, బి.రాజు, ఎం.భాగ్యరాజు తదితరులు పాల్గొన్నారు.

రూ.లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న సాక్షి పద్మనాభం

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ ప్రసన్నాంజనేయస్వామి ఆలయం వద్ద శ్రీరామ నామ సప్త సప్తాహ మహోత్సవానికి స్థానిక 8వ వార్డు సభ్యుడు సాక్షి పద్మనాభం తన దివంగత సోదరుడు సత్తిరాజు పేరిట రూ.లక్ష విరాళం సమర్పించారు. ఈ నెల 2 నుంచి జూలై 21 వరకు 49 రోజుల పాటు నిర్వహిస్తున్న ఈ సప్త సప్తాహం జరుగుతుంది. కార్యక్రమంలో ప్రసన్నాంజనేయ బాలభక్త సమాజం అధ్యక్షుడు బోణం శ్రీను, కైరం వీర వెంకట సత్యనారాయణ (సతార్ స్వామి), రోళ్ల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ హామీలు ఎక్కడ అమలు చేశారు?



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు

మలికిపురం: ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు ఎక్కడ అమలు చేశారని కూటమి ప్రభుత్వాన్ని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు సూటిగా ప్రశ్నించారు. మలికిపురంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సూపర్‌సిక్స్ పథకాలన్నీ ప్రారంభించి అమలు చేస్తున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. సూపర్‌సిక్స్ పథకాల్లో ఉచిత గ్యాస్ డబ్బులు పడటం లేదని రాష్ట్ర వ్యాప్తంగా మహిళలు అడుగుతూంటే చంద్రబాబుకు వినబడటం లేదా అని ప్రశ్నించారు. ఉచిత బస్సు ప్రయాణం ఏదని మహిళలు ప్రశ్నిస్తున్నా చెవులు మూసుకున్నారా అని నిలదీశారు. తల్లికి వందనం పథకం అమలులో అడ్డగోలు నిబంధనలు పెట్టి లబ్దిదారుల్లో కోత విధించారని ఆగ్రహం వ్యక్తం చేశా రు. కుటుంబంలో ఉన్న విద్యార్థులందరికీ తల్లికి వందనం ఇస్తామని చెప్పి, ఇప్పుడు సగం మందికే ఇస్తున్నారని విమర్శించారు. అందులోనూ కరెంట్ బిల్లు, కార్లు ఉన్నాయంటూ కోత విధించారని, ఇచ్చిన దానిలో పాఠశాలల నిర్వహణకు రూ.2 వేలు మినహాయిస్తున్నారని చెప్పారు. ప్రైవేటు పాఠశాల విద్యార్థులకు ఇచ్చిన డబ్బుల్లో రూ.2 వేలు ప్రైవేటు పాఠశాలల నిర్వహణకు ఇస్తారా అని గొల్లపల్లి ప్రశ్నించారు. ప్రతి నెలా తమకు ఇస్తామన్న రూ.1,500 ఎక్కడని పద్దెనిమిదేళ్ల నిండిన మహిళలు అడుగుతున్నా కూటమి నేతలకు వినబడటం లేదని ఆక్షేపించారు. యువతకు ఉపాధి, నిరుద్యోగ భృతి ఎక్కడని ప్రశ్నించారు. ఏ ఒక్క పథకమూ అమలు చేయకుండానే సూపర్ సిక్స్ అమలు చేసేసినట్లు ప్రకటించడం చౌకబారు ప్రచారానికి నిదర్శనమని దుయ్యబట్టారు. నవరత్న పథకాలతో ఇచ్చిన హామీలనే కాక ఇవ్వనివి కూడా అమలు చేసిన ఘనత మాజీ సీఎం జగన్‌కే దక్కిందని గొల్లపల్లి అన్నారు. విలేకరుల సమావేశంలో పార్టీ నాయకులు పాటి శివకుమార్, అడబాల జానకిరామ్, గుర్రం జాషువా, జిల్లెల్ల ఉదయకిరణ్, మోకా సురేష్, గుర్రం వెంకటరమణ, తాడి సహదేవ్, నాని పాల్గొన్నారు.

సమస్యకు పరిష్కారం



రహదారిపైకి చొచ్చుకొచ్చిన కొమ్మలు (ఫైల్)



చెట్టు కొమ్మలను తొలగించిన తర్వాత

సాక్షి ఇంపాక్ట్

కపిలేశ్వరపురం: వెదురుమూడి పోలేరమ్మ ఆలయ సమీపంలో ఆర్అండ్‌బీ రహదారిపైకి వరకు ఏపుగా పెరగడంతో ఆ కొమ్మలను సర్పంచ్ ఆధ్వర్యంలో శుక్రవారం తొలగించారు. చెట్టుకొమ్మలు శూలాల్లా పొడుచుకువచ్చి ప్రమాదభరితంగా మారాయంటూ ఈ నెల 12న 'సాక్షి' దిన పత్రికలో 'తగిలితే కన్ను ఖతం' శీర్షికతో వార్త ప్రచురితమైంది. సమస్యపై సర్పంచ్ చోడే రామలక్ష్మి, కార్యదర్శి శారద స్పందించారు. ఉపాధి కూలీల సహకారంతో కొమ్మలను తొలగించారు. సమస్యను పరిష్కరించిన కార్యదర్శి శారద, సర్పంచ్ రామలక్ష్మి, ఉపాధి కూలీలకు, సమస్యను అధికారుల దృష్టికి తీసుకొచ్చిన 'సాక్షి' దినపత్రికకు ప్రయాణికులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.